01ATP05F_01ATP05F.qxd 05-02-2023 PM 11:43 Page 1


అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 06 ఫిబ్రవరి 2023 పేజీలు : 04

# కేంద్రం తీరు ఆక్షేపణీయం

-అప్పర్ భద్రతో రాయలసీమకు నష్టం
-ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరముంది
-రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

**అనంతపురం, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త బ్యూరో:** ఎటువంటి అనుమతులు లేకుండా కర్ణాటక చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా, గుర్తింపు నిచ్చి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించడం అక్షేపణీయమని, ఇది రాయలసీమ ప్రాంతానికి తీరని నష్టం చేకూర్చడమేనని వక్తలు పేర్కొన్నారు. తక్షణం ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపివేయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఐక్య పోరాటానికి సన్నద్ధమవ్వాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. 'అప్పర్ భద్ర నిర్మాణం', 'జిల్లా నీటి వనరులకు ప్రమాదం' అన్న అంశంపై ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక ప్రెస్ క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వైసిపి, బిజెపి మినహా టిడిపి, సిపిఎం, సిపిఐ, సిపిఎంఎల్, న్యూ డెమోక్రసి, కాంగ్రెస్ పార్టీల నాయకులతో పాటు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలువ శ్రీనివాసులు మాట్లాడుతూ, అప్పర్ భద్ర ప్రాజెక్టు వలన రాయలసీమ జిల్లాలకు తీరని నష్టం చేకూరుతుందన్నారు. ఈ ప్రాజెక్టుకు అనుమతిలివ్వడానికి బచావత్ ట్రిబ్యూనల్ ఆనాడే వ్యతిరేకించిందని గుర్తు చేశారు. నదీ జలాల మల్లింపు ద్వారా వచ్చే మిగులు పేరుతో ఇప్పుడు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యూనల్ ముందు పెట్టినా ఇంకా అది న్యాయస్థానంలోనే ఉందన్నారు. అక్కడ అడిగింది కూడా 9 టిఎంసిలేనని, అయితే కర్ణాటకలో చేపడుతున్న ప్రాజెక్టు వలన సుమారు 40 టిఎంసిల వరకు ఎగువభాగంలోనే నీటిని తోడేసుకునే అవకాశముందన్నారు. దీని వలన తుంగభద్ర డ్యామ్‌కు నీరు చేరడంలో ఆలస్యమయ్యే వకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. దీని వలన హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సికి వచ్చే నీటి వాటల్లో కోతలు పడనున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. దీని వలన రాయలసీమ ప్రాంతానికి తీరని నష్టం చేకూరే అవకాశాలున్నాయన్నారు. కావున ఈ ప్రాంతానికి చెందిన అందరు రాజకీయాలకు అతీతంగా ఐక్యంగాపోరాడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా కర్ణాటకలో జరగబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అప్పర్ భద్రకు జాతీయ హోదాను కల్పించడమేకాకుండా రూ.5300 కోట్లు నిధులు కేటాయించిందన్నారు. రాష్ట్ర విభజన హామీల్లో ఒకటిగా ఉన్న పోలవరం ప్రాజెక్టుకు మాత్రం 2011 నాటి ధరలతోనే నిధులు కేటాయిస్తామని చెబుతూ, కర్ణాటకలో అప్పర్ భద్రకు మాత్రం కొత్త ధరలకు అనుగుణంగా నిధులు కేటాయించడం ఆ పార్టీ ద్వంద వైఖరికి అద్దం పడుతోందని విమర్శించారు. పక్క రాష్ట్రాల అభ్యంతరాలను సైతం పట్టించుకోకుండా ఈ ప్రాజక్టు నిధులు కేటాయించడం అన్యాయమన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని రూపొందించాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ, రాయలసీమ ప్రాంతానికి నష్టం చేకూర్చు విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరు ఉందన్నారు. దీనికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను చేపట్టాల్సి ఉందన్నారు. రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్రంలోని బిజెపి సర్కార్ కర్ణాటకలో అనుమతుల్లేనిప్రాజెక్టుకు నిధులు కేటాయించిందని, సిపిఐ, ఎంఎల్, న్యూ డెమోక్రసి నాయకులు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. మనావహక్కుల వేదిక నాయకులు ఎస్.ఎం.బాషా మాట్లాడుతూ, ఎటువంటి అనుమతుల్లేకుండా అక్రమ ప్రాజక్టుకు నిధులు కేటాయించి జాతీయ హోదాను కేటాయించడం ఇది అప్రజాస్వామికమైన చర్య అన్నారు. ఇది కేవలం రాయలసీమ ప్రాంతానికి జరిగిన అన్యాయంగానే చూడలేమని, ఇది ప్రజా స్వామిక విలువలకు విరుద్ధమైన దుర్మార్గమైన చర్య అని ఖండించారు. జలసాధన సమితి నాయకులు గంగిరెడ్డి మాట్లాడుతూ, ఈ సమస్యపై ప్రజా ప్రతినిధులపై తీవ్ర ఒత్తిడి తీసుకురవాల్సిన అవసరముందన్నారు. క్షేత్ర స్థాయి నుండి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి పెద్ద పోరాటాన్ని రూపొందించడం ద్వారానే ఈ ప్రాతానికి జరిగే అన్యాయాన్ని ఆపగలమని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దాదాగాంధీ, ఎపి రైతు సంఘం (సిపిఐ) జిల్లా కార్యదర్శి చెన్నప్ప, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, అనంత హక్కుల వేదిక నాయకులు రసూల్, ఐద్వా రాష్ట్ర నాయకులు సావిత్రి, డివైఎఫ్ఐ నాయకులు నరసింహారెడ్డి, సిఐటియు నాయకులు రామాంజినేయులు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ శాఖలో... ఆ డిటి రూటే సప 'రేటు'

- ఆయన టార్గెట్‌కు రీచ్ అయితే అంతా ఓకే
- బెడిసి కొట్టిందో చుక్కలు చూడాల్సిందే...!



**శ్రీసత్యసాయి జిల్లా, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లా కేంద్రానికి సమీపంలోని ఓ మండల రెవెన్యూ కార్యాలయంలో ఆ డిప్యూటీ తహశీల్దార్ రూటే సప'రేటు'. అధికార పార్టీ నేతల అండదండలు, ఉన్నతాధికారుల ఆశీస్సులు ఉన్నంత వరకు నన్నెవరూ ఏమీ చేయలేరన్న అహంకార దోరణితో ఆ అధికారి వ్యవహరించే తీరు పలువురికి విస్మయం కలిగిస్తున్నది. ఏదైనా పనిపై ఆయనను ఆశ్రయిస్తే నిర్లక్ష్య వైఖరితో సమాధానాలు ఇస్తుంటాడని పలువురు వాపోతున్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించదలచుకుంటే ఈ అధికారి పలు మార్గాలను అన్వేషించి పరిష్కరిస్తుంటారు. అదే సమస్యను పరిష్కరించ కూడదు అనుకుంటే దానికి ఎన్నో కొర్రీలు తప్పవు మరి..! సదరు అధికారి స్వార్థపూరిత ప్రయోజనాల దృష్ట్యా అన్ని సక్రమంగా ఉన్నా అందులో లేనిపోనివి వెతికి చిన్నపాటివి కూడా భూతద్దంలో చూపిస్తూ నిబంధనల పేరుతో వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం సర్వసాధారణంగా మారింది. ఈ అధికారి పెట్టే మెలికలతో ఇబ్బందులకు గురవుతున్న కొందరు ఎవరికీ చెప్పుకోలేక అంతర్గతంగా మధన పడుతూ కుమిలిపోతున్నారు. ఈయన వ్యవహారశైలిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే మరిన్ని సమస్యలను కొని తెచ్చుకున్నట్లు అవుతుందని బాధితులు ఆవేదన చెందుతున్నారు. కాసుల కక్కుర్తితో సదరు రెవెన్యూ కార్యాలయంలో ఆ డిటి అడ్డదిడ్డమైన మార్గాలను అన్వేషిస్తూ తాను చెప్పిందే శాసనం, చేసిందే చట్టం అన్న తీరుగా వ్యవహరిస్తున్నాడనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇక్కడ ఆయనకు ధనిక, పేద తారతమ్యం ఏమాత్రం లేదు. మీ పని జరగాలంటే ఆయన రూటుకు వెళ్ళాల్సిందే. చెప్పిన టార్గెట్‌ను రీచ్ కావాల్సిందే. బెడిసి కొట్టిందో సుడిగుండంలో పడ్డట్టే...చుక్కలు చూడాల్సిందే...! కావాల్సిన వారు, కాసులు ఇచ్చే వారంటే ఆయనకు అమిత ప్రేమ. కాసుల ముందు ఆయనకు నిబంధనలు బలాదూర్....! ఆయన రూటుకు వెళితే నిబంధనలు తుంగలోకి తొక్కైనా రికార్డులలో మార్పులు చేసి అయినా పని పూర్తీ చేయగల సమర్థుడని ప్రతీతి. కొన్ని సందర్భాల్లో భారీ మొత్తాలో డిమాండ్ చేసినప్పుడు తాను ఒక్కడికే కాదు స్టేజ్ వారీగా పై స్థాయి వరుకు చేరాల్సింది... చేర్చాల్సి ఉంటుందని బాధితులకు నచ్చజెప్పే ప్రయత్నాలు చేస్తుంటాడన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. ఆ రెవెన్యూ కార్యాలయానికి ఏ సమస్యపైన ఎవరు వెళ్ళి తహశీల్దార్‌ను కలసి విన్నవించుకున్నా, సత్వరమే డిటి గారిని కలవండంటూ ఆ తహశీల్దార్ సూచిస్తుండడం చూస్తే అక్కడ ఆ డిటి ఏ స్థాయిలో వ్యవహారాలు నడుపుతున్నాడో అర్థమౌతుంది. నిబంధనలకు అనుగుణంగా అన్ని సక్రమంగా చట్టబద్దంగా ఉన్నప్పటికీ ఆ సమస్యల పరిష్కారం ఆ అధికారి కరుణా కటాక్షాలపై మాత్రమే ఆధారపడి ఉంటుంది. రూల్స్ పేరుతో పొరపాటున ఎవరైనా ఆ అధికారిని ప్రశ్నించారో? కొర్రీలపై కొర్రీలు తప్పవు మరి, నెలలు, సంవత్సరాలు గడవాల్సిందే... చెప్పులు అరగాల్సిందే...! అవసరమనిపిస్తే అందుకు సంబంధించిన రికార్డులను మాయం చేసి, వీటికి సంబంధించిన రికార్డులు ఈ కార్యాలయంలో లేవని తప్పించుకోవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ప్రతిపక్ష నేతలతో ఉన్న చొరవ, అధికార పక్ష నేతలతో ఉన్న సంబంధాల దృష్ట్యా తనను ప్రశ్నించే వారు ఎవరూ లేరని, తానే ఒక మోనార్క్ అన్న అహంతో విర్రవీగుతుంటాడు. ప్రతిపనికి ఓ రేటు నిర్ణయిస్తూ ఎక్కువ శాతం దళారులతో వ్యవహారం నడిపిస్తూ, తనకు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుంటాడు ఈయన. సమస్యల పరిష్కారానికి ఈ కార్యాలయానికి వెళ్ళే వారు పడే పాట్లు వర్ణణాతీతం. ఈ అధికారి అంచనాలను అందుకోలేక ఈయన సృష్టించే పలురకాల తిరకాసులతో సమస్యలను పరిష్కరించుకోలేక ఎంతో మంది బాధితులు తీవ్ర ఆవేదనకు గురౌతున్నారన్న వాదనలు లేకపోలేదు. ధనార్జనే ధ్యేయంగా ఈ అవినీతి అధికారి చేసే అడ్డదిడ్డమైన వ్యవహా రాలతో తాము ఎక్కడ బలిపశువులు కావాల్సివస్తుందోనన్న భయాందోళనలు ఈ కార్యాలయంలోని క్రింది స్థాయి అధికారులకు ఉన్నాయంటే ఇక్కడి పరిస్థితి ఏమిటో ఇట్టే అర్థమౌతుంది. ఇక్కడ పని చేసిన కాలంలోనే ఈయన పలు అక్రమ వ్యవహారాలకు ఊతమిస్తూ అవినీతి సొమ్ముతో కోట్ల రూపాయల అక్రమ ఆస్తులు కూడగట్టుకున్నాడన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అవినీతి అక్రమాలకు కేరాఫ్ ఆ డిటి అనడంలో ఎటువంటి సందిగ్ధం లేదని పలువురు వ్యాఖ్యానిం చడం చూస్తే ఆ అధికారి తీరు ఏమిటో అవగతమౌతుంది. ప్రజా సమస్యలు సజావుగా పరిష్కారమయ్యేందుకు ఇలాంటి అవినీతి అధికారులపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే!!

# బంజారాల సమస్యల సాధనకు ఉద్యమిద్దాం

- ఎఐబిఎస్ఎస్ ద్వారా నడుంబిగిద్దాం


బంజారాల సమైక్యతను చాటి చెబుదామంటున్న ఎఐబిఎస్ఎస్ నాయకులు

**పుట్టపర్తి, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త**

బంజారాల అభ్యున్నతికి ఐకమత్యంతో ఉద్యమిద్దామని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రవీంద్ర నాయక్, మాజీ ఎస్‌పి పిలుపునిచ్చారు. ఆదివారం నాడు శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని సాయి అరామం నందు ఉమ్మడి అనంతపురం జిల్లా ఎఐబిఎస్ఎస్ కార్యవర్గం ఎంపిక, సమావేశం నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటరమణ నాయక్, రాష్ట్ర కార్యదర్శి చక్రేనాయక్, ఎం.శ్రీనివాస్ నాయక్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు వందలాది మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన జాతిని వారికి జరుగుతున్న పరిణామాల గురించి జాతీయ కార్యదర్శి రవీంద్రనాథ్ సుదీర్ఘ ప్రసంగం చేశాడు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 యేళ్ళు గడచిపోయినా బంజారాలు, సుగాలీలు ఇప్పటికీ అనేకమంది వెనుకబడి ఉన్నారన్నారు. సమస్యల సాధన కోసం పోరాటం చేసేందుకు వివిధ సంఘాలుగా వెలసి ఉన్నా...జాతి అభ్యున్నతి కోసం అందరం కలసికట్టుగా పోరాటం చేద్దామని ఆయన కోరారు. అదే విధంగా వైఎస్ఆర్ కడపజిల్లాకు చెందిన మాజీ ఐపిఎస్ అధికారి లక్ష్మానాయక్ మాట్లాడుతూ, గిరిజన బిడ్డలు అన్ని రంగాల్లో రాణించాలంటే విద్యతోనే సాధ్యమని, ఎన్ని వెయ్యి ప్రయాసాలు అయినా ఓర్చి ప్రతి గిరిజన బిడ్డను చదివించాలన్నారు. చదువుతో సాధించలేనిది ఈ లోకంలో లేదన్నారు. సునీత శంకర్ లాల్‌నాయక్ మాట్లాడుతూ, మహనీయుడు డా.బి.ఆర్.అంబేద్కర్ రిజర్వేషన్‌ల వల్ల ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వర్గాల ప్రజలకు నేడు న్యాయం జరుగుతోందన్నారు. గిరిజన జాతి బిడ్డలు రిజర్వేషన్ వల్ల నేడు కొద్దో గొప్పో రాజ్యాధికారం అనుభవిస్తున్నారని, ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోబడ్డ గిరిజన బిడ్డలను సంస్కరించుకోవడం, సన్మానించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఎఐబిఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రేనాయక్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన తండాల అభివృద్ధిని విస్మరించడం సబబు కాదన్నారు. ఇప్పటికీ అనేక తండాలకు రోడ్డు, నీటి వసతి, మౌళికసదుపాయాలు వంటి సమస్యలతో అక్కడి ప్రజలు సతమతమౌతున్నారని, గిరిజన జాతికే పూర్తీ స్థాయి న్యాయం జరగకపోగా ఇతర కులాల వారిని తమ జాతిలో ఎస్‌టిలుగా చేర్చాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జీవో నెంబర్ 52 ద్వారా ఇతర కులాల వారిని ఎస్‌టిల్లో చేర్చే ప్రక్రియ మానుకోవాలని హెచ్చరించారు. లేనిపక్షంలో ఎఐబిఎస్ఎస్ ద్వారా ఉద్యమిస్తామన్నారు. కార్యనిర్వాహక కార్యదర్శి మూడ్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ, ప్రపంచ నాగరికతలోనే భారతదేశ బంజారాల సంస్కృతి, ఆచారాలు, సాంప్రదాయాలు, జీవనశైలి భిన్నంగా ఉంటుందన్నారు. దేశ రాజకీయ చరిత్రలోనే త్యాగాలు చేసిన ఘనత బంజారాలకు ఉందన్నారు. రాష్ట్రంలో రాజకీయంగా బంజారా బిడ్డలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని శ్రీనివాసనాయక్ కోరారు.

**ఎఐబిఎస్ఎస్ జిల్లా కార్యవర్గం ఎంపిక**

ఆల్ ఇండియా బంజార సేవా సంఘం శ్రీసత్యసాయి జిల్లా ఉమ్మడి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఎస్.ఆంజనేయులునాయక్, ఉపాధ్యక్షులుగా వరుణ్ నాయక్, రామాంజినేయ నాయక్, మోహన్ నాయక్, రాజేష్‌నాయక్, సుధాకర్ నాయక్, గౌరవాధ్యక్షు లుగా సతీష్‌నాయక్, మహిళా అధ్యక్షురాలిగా హేమలత, జనరల్ సెక్రెటరీగా అంజినాయక్, జాయింట్ సెక్రెటరీగా తిరుమల నాయక్, రాజునాయక్ తదితరులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పెడపల్లి శ్రీనివాస్ నాయక్‌ను ప్రత్యేకంగా సన్మానించి ప్రశంసించారు.

# రాష్ట్రంలో ప్రజాసంక్షేమమే పరమావధి : పిజెఆర్

-అశేష జనవాహిని నడుమ పిజెఆర్‌కు ఘనస్వాగతం -అడుగడుగునా పాదపూజలు, గజమాలలతో సత్కారాలు


గజమాలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం


పిజెఆర్ పాదయాత్ర కొనసాగుతున్న దృశ్యం

**గుత్తి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త**

రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అరాచకపాలన కొనసాగుతోందని తద్వారా అభివృద్ధి అడుగంటిపోయి రాష్ట్రం నాలుగు దశాబ్దాలు వెనక్కు వెళ్లిందని పిజెఆర్ ట్రస్ట్ చైర్మన్, సీనియర్ టిడిపి నేత పెరుమాళ్ల జీవానందరెడ్డి విమర్శించారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా లోక కళ్యాణార్థం అనంతపురం నుండి శ్రీశైలం వరకు చేపట్టిన పాదయాత్రకు అడుగడుగునా ఘనస్వాగతం లభించింది. రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని తపోవనం శివాలయం నుండి పాదయాత్ర చేపట్టిన ఆయన ఆదివారం గుత్తి పట్టణంలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా ఆయనకు పూలవర్షంతో ఘనస్వాగతం పలికారు. శ్రీశైలంలో ప్రతిష్ఠించనున్న 7 అడుగుల ఎత్తు వున్న శివలింగానికి గజమాల సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. శివారు ప్రాంతం నుండే ఆయనకు ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు. పలువురు ఆయనకు పాదాభివందనం చేసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ట్రస్ట్ స్థాపించినప్పటి నుండి ఆయన పేద ప్రజల సౌకర్యార్థం వివాహాలు, ఆరోగ్య సంబంధిత చికిత్సలు, విద్యాభివృద్ధి, తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ ఆర్థిక సాయం అందిస్తున్నారని వక్తలు కొనియాడారు. ఆర్థికంగా వెనుకబడిన గుంతకల్లు నియోజకవర్గంలో మహిళలకు ఉపాధి కల్పన, ఆర్థిక స్వావలంబనకై గజరాంపల్లి వద్ద వెయ్యి మందికి ప్రత్యక్షంగా మరో రెండు వేల మందికి పరోక్షంగా ఉపాధి నిమిత్తం గార్మెంట్స్ పరి శ్రమ ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఆయన తన వద్దకు సహాయం కోసం వచ్చే వారికి తనవంతు సాయం అందించే మనసున్న వ్యక్తి అంటూ వారు కొనియాడారు. దాదాపు 300 కిలోమీటర్లు ఈ పాదయాత్ర కొనసాగనుంది. ఈ పాదయాత్రలో 7 అడుగుల ఎత్తు వున్న శివలింగం ప్రజలను విశేషంగా అకట్టుకుంటోంది. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్య క్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. పట్టణ శివారు వరకు పాదయాత్రకు ప్రజలు అడుగడుగునా నీరాజనం పలుకుతూ పూలవర్షం కురిపించారు. పదిమందికి సహాయం చేసే మనస్తత్వం వున్న జీవానందరెడ్డి చల్లగా వుండాలంటూ మహిళలు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పిజెఆర్ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. యవతరాన్ని చైతన్య పరిచేందుకు నారా లోకేష్ యువగళం పేరుతో పాదయాత్ర చేపట్టారని ఆయనకు వస్తున్న ప్రజాదరణ ఓర్వలేక నిరంకుశ ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయించి అడ్డుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. అయితే పాదయాత్ర 4 వేల కిలోమీటరు ఖచ్చితంగా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు యాదవ్, మాజీ సింగిల్‌విండో చైర్మన్ కరిడికొండ సూర్యచంద్రుడు, తెలుగుయువత కన్వీనర్ సుధాకర్‌నాయుడు, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, దాసా రాము, శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి, శివమాలదారణ భక్తులు, తేదేపా కార్యకర్తలు, ట్రస్ట్ సభ్యులు, పెద్దఎత్తున అభిమానులు, ప్రజానీకం పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికి మేలు చేసే విధంగా సంక్షేమ పథకాలు

-జిల్లా ఇంచార్జ్ మంత్రి గుమ్మనూరు జయరామ్


నూతనభవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి,ఎంపి,ఎమ్మెల్యేలు

**కదిరి, ఫిభ్రవరి 05 ,ప్రభాతవార్త:** మన రాష్ట్ర ముఖ్యమంత్రి అర్హులైన ప్రతి ఒక్కరికి మేలు చేసే విదంగా సంక్షేమ,అబివృద్ధి కార్యక్రమాలు చేడుతున్నారని జిల్లా ఇంచార్జ్ మంత్రి గుమ్మనూరు జయరామ్ పేర్కొన్నారు.ఆదివారం కదిరిలో నూతనంగా నిర్మించిన పట్టణ పోలీస్ స్టేషన్ ప్రారంబోత్సవ కార్యక్రమంలో హిందూపురం ఎంపి గోరంట్ల మాదవ్, కదిరి ఎమ్మెల్యే పి.వి.సిద్దారెడ్డి,పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ,జడ్పీ చైర్మన్ గిరిజమ్మ,కలెక్టర్ బసంత్‌కుమార్,ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న ప్రతి గ్రామంలో శాంతి, భద్రతలకు ఆటంకం లేకుండా పోలీస్ వ్యవస్థను పటిష్టం చేశారని తెలిపారు.నూతనంగా పోలీస్ నియామకాలు చేపట్టారన్నారు.ప్రజలందరు జగనన్న అందిస్తున్న సంక్షేమంతో అబివృద్ధి బాటలో పయనిస్తున్నారని పేర్కొన్నారు.మంత్రి మాట్లాడుతూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోమటం వెంకటరెడ్డి ఫోన్ ట్యాపింగ్ చేశారని చెప్తున్నవన్నీ అవాస్తవాల న్నారు.అయితే ఆయన తెలుగుదేశం పార్టీలోకి వెళ్ళాలన్న ఉద్దేశంతోనే ఆరోపణలు చేస్తున్నారని ఫోన్ ట్యాపింగ్ అన్నది ఎక్కడా లేదన్నారు.నారాలోకేష్ చేస్తున్న పాదయాత్రకు జనాదరణ అసలు లేదన్నారు.జగనన్న చేసిన పాదయాత్రకు నారాలోకేష్ చేస్తున్న పాదయాత్రకు ఏ మాత్రం పోంతన లేదన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నజిమున్నీసా,వైస్ చైర్మన్ గంగాదేవి,అభిజ్ఞ పౌండేషన్ అధినేత పవన్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు ఇస్మాయిల్, రంగారెడ్డి, ఆలయ కమిటి చైర్మన్ గోపాలక్రిష్ణ,డి,యస్,పి భవ్యకిషోర్,సిఐలు, ఎస్,ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా

# శ్రీ కొండమీదరాయస్వామి రథోత్సవం

- గోవింద నామస్మరణతో మారుమ్రోగిన బుక్కరాయసముద్రం


కొండమీదరాయుని రథోత్సవం

**బుక్కరాయసముద్రం ఫిబ్రవరి 5 ప్రభాతవార్త**

గోవింద నామస్మరణతో బుక్కరాయసముద్రం మారు మ్రోగింది శ్రీ కొండమీదరాయ స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా 7వ రోజు ఆదివారం మాఘ శుద్ద పౌర్ణమి సందర్భంగ శ్రీవెంకటేశ్వర స్వామి కి బుక్కరాయసముద్రం గ్రామంలోని శ్రీ లక్ష్మినారాయణ స్వామి దేవాలయంలో తెల్లవారు ఝామున అలివేలుమంగమ్మ శ్రీ వెంకటేశ్వరస్వామి కి వేదపండితులు బ్రాహ్మణులు వేదమంత్రోత్సవంతో అత్యంత వైభవంగ కల్యాణోత్సవం నిర్వహించారు. రథాన్నిలాగే ముందు రథం ముందు యజ్ఞం, పూర్ణహుతి నిర్వహించారు. యజ్ఞంతమున బలిహారణ నైవేద్దాన్ని రథం చుట్టూ ఉండే బొమ్మలకు నివేదించారు. అనంతరం ఉత్సవ మూర్తులను సూర్య ప్రభవాహనం పై ఊరేగించుకుంటు

మిగతా 3లో...

# జర్నలిస్టులపై దాడులను సమిష్టిగా ఎదుర్కొందాం

- ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు ఐ.వి.సుబ్బారావు


మాట్లాడుతున్న ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు

**అనంతపురం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త బ్యూరో**

ఇటీవల కాలంలో జర్నలిస్టులపై దాడులు అధికమయ్యాయని భవిష్యత్తులో వాటిని సమిష్టిగా ఎదుర్కోవాల్సిన అవసరం వుందని ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు ఐ.వి సుబ్బారావు తెలిపారు. అనంతపురంలో ఆదివారం జరిగిన ఉమ్మడి అనంతపురం జిల్లా సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు జర్నలిస్టుల హక్కులను కాలరాస్తున్నాయని, జర్నలిస్టుల సంక్షేమాన్ని పూర్తిగా పక్కన పెట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు సంబంధించిన పథకాల అమలులో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని

మిగతా 3లో...

## బాబాయ్ హత్య కేసులో జైలుకు వెళ్లడం ఖాయం

- సంచలన వాఖ్యలు చేసిన జడ్జి రామకృష్ణ



మాట్లాడుతున్న జడ్జి రామకృష్ణ, బి.కె

పెనుకొండ, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

జగన్ నరరూప రాక్షసుడు. బాబాయి హత్య కేసులో త్వరలోనే జైలుకు వెళ్లడం ఖాయమని జడ్జి సంకు రామకృష్ణ సంచలన వాఖ్యాలు చేశారు. ఆదివారం ఎస్ఆర్కె చైతన్య యాత్ర ప్రజా ప్రస్థానం టూ న్యాయ స్థానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంకు రామకృష్ణ, శ్రీ సత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బికె పార్థసారథి ముఖ్య తిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు అధ్యక్షత వహించారు. నియోకవర్గం పరిధిలోని అన్ని మండలాల నుంచి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జడ్జి సంకు రామకృష్ణకు పెనుకొండ శ్రీ కృష్ణదేవరాయ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి జడ్జి పూల మాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ రెడ్డి చెబుతున్న సంక్షేమం ఏనాడో ఎన్టీ రామారావు చూపించారు. రూ. 2 కిలో బియ్యం, పక్కా గృహ నిర్మాణాలు, జనతా వస్త్రాలు, ఆడబిడ్డలకు ఆస్తిలో భాగం వంటి ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు గాలేరు, నగరి, హంద్రీనీవా సాగునీటి ప్రాజెక్టులను రాయలసీమ ప్రాంతానికి తీసుకోచ్చి ఈ ప్రాంత ప్రజలకు తెల్ల అన్నం పరిచయం చేసిన ఏకైక ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని అన్నారు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక దళితులకు చెందిన 27 పథకాలను గంగలో కలిపేశాడని విమర్శించారు. అవినీతి చేయని ముఖ్య మంత్రిపై 12 సిబిఐ కేసులు, 16 ఈడి కేసులు ఎందుకు, 136 కేసులు ఎందుకని ప్రశ్నించారు. మరో మారు జగన్ సీయం అయితే మన రాష్ట్రం మరో బీహార్ అవుతుందన్నారు. సకల శాఖ మంత్రిగా ఉన్న సజ్జల రామకృష్ణుడు ఒక ఊర కుక్కలాంటి వాడని ఆయన సలహాలు, సూచనలతో రాష్ట్రం దిగజారి పోతుందన్నారు.

### న్యాయస్తులను ఇబ్బంది పెట్టిన వైసీపీ పార్టీ : సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బి.కె పార్థసారథి

నాయ్యస్థానాలను ఇబ్బంది పెట్టిన పార్టీ వైసీపీ పార్టీ అని శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె. పార్థసారథి అన్నారు. కరోనా మహమ్మారి ప్రబలి ప్రజల ప్రాణాలు పోతున్న సమయంలో రోగులకు ఉద్యోగులకు మాస్కులు అడిగినందుకు వైసీపీ మంత్రులు, అధికారులు, సీయం వైఎస్ జగన్ వైద్యులపై లేని పొని కేసులు పెట్టం కాకుండా ప్రాణాలు పోసే డాక్టర్‌ను పిచ్చోడని, పది మందికి న్యాయం చేసే న్యాయస్థులు ద్రోహులు అనేలా వారిని తీవ్ర ఇబ్బంది పెట్టిన ఘనత వైసీపీదేనన్నారు. దళితులు అత్యాచారాలకు, అన్యాయాలకు గురి అవుతున్నారని ఇది ఏమి అని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు వేధింపులకు గురి చేస్తున్నారని వైసీపీ పాలనకు చమర గీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని పై నున్న దేవుడు కింద ఉన్న ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వానికి చమర గీతం పాడి జగన్‌ను జైలుకు పంపే సమయం దగ్గర పడిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బంజారాసేవాసంఘం నూతన కమిటీ ఎన్నిక

-రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గోరంట్ల వాసి నాగేనాయక్



ప్రమాణస్వీకారం చేస్తున్న నాగేనాయక్

గోరంట్ల, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటరమణనాయక్ ఆధ్వర్యంలో ఆదివారం పుట్టపర్తి సాయి ఆరామంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా గోరంట్ల పట్టణానికి చెందిన ఎస్.నాగేనాయక్, జిల్లా ఉపాధ్యక్షునిగా గడ్డంతాండా వరుణ్‌కుమార్‌నాయక్, జిల్లా జనరల్ సెక్రటరీగా కరావులపల్లితాండా రాజేష్‌నాయక్‌లను ఎన్నుకుని ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేనాయక్ మాట్లాడుతూ బంజారా సేవాసమితి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ బంజారాలను అభివృద్ధి పతంలో నడిపించడానికి నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని బంజారా సమగ్రతకు కష్టపడతానని సంఘం పెద్దలు నిర్దేశించిన నియమాలను పాటిస్తానని, బంజారాల సాంప్రదాయాలను తప్పక గౌరవిస్తానని, బంజారాల హక్కుల కోసం పోరాటం చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త శంకర్‌నాయక్, ఎర్రభాస్కర్‌నాయక్, లాయర్ తిప్పేనాయక్, రిటైర్డ్ ఎస్‌పిలు లక్ష్మనాయక్, చక్రినాయక్, మురళినాయక్ పాల్గొన్నారు.

## అంగరంగవైభవంగా శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం

అమరాపురం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



వెంకటేశ్వరస్వామి రథోత్సవ దృశ్యం

అమరాపురం పట్టణంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్‌గుప్తా, వెంకటసుబ్బయ్య ఆర్యవైశ్యల పెద్దల సమక్షంలో శ్రీ వారి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు శ్రీనిధి భట్టర్ తెల్లవారుజామునే అభిషేకం, సహస్రనామానర్చన నిర్వహించి విశేష పూజలతో స్వామి వారిని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



స్వామి వారికి విశేష పూజల దృశ్యం

గ్రామ పెద్దతలతోపాటు ఆర్యవైశ్య సంఘం సభ్యులు అశోక్ విజయ్‌కుమార్, అజయ్ రాఘవేంద్రగుప్తా, సిద్దేశ్వర, వేణు, శ్రీధర్ తదితరులతోపాటు స్థానిక ప్రజా ప్రతినిధుల సమక్షంలో బ్రహ్మరథోత్సవానికి ప్రత్యేక పూలమాలలతో సుందరంగా అలంకరించారు. స్వామి వారి ఉత్సవ మూర్తిని మేళాతాళాలతో బ్రహ్మరథోత్సవం వద్దకు తీసుకోచ్చి అర్చకులు రథాంగ హోమాని న్నిర్వహించి శ్రీవారి ఉత్సవ మూర్తిని ప్రతిష్ఠింపజేసి అనంతరం భక్తులు గోవిందనామ స్మరణలు చేస్తూ బ్రహ్మరథాన్ని లాగారు. అమరాపురం చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి విచ్చేసి భక్తులు రథోత్సవానికి అరటి పండ్లు, బొరుగులు విసిరి మొక్కులు తీర్చుకున్నారు.

అమరాపురంకు చెందిన ఆర్యవైశ్య రాజ్‌కుమార్, నవ్యశ్రీలు విచ్చేసిన భక్తులకు పానకం పెసరబ్యాళ్లను వందలాది మంది భక్తులకు అందజేశారు. అదే విధంగా బ్రాహ్మణులకు అన్నసంతర్పణ, ఆర్యవైశ్యలకు అన్న సంతర్పణ, సార్వజనీకులకు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ రామాంజినేయులు, హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

## అక్రమ నియామకాలపై ఫిర్యాదు

డి.హిరేహాళ్ ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

అనంతపురం జిల్లాలో కన్నడ మాధ్యమ పాఠశాలల్లో జరిగిన అక్రమ నియామకాలపై సంబంధిత అధికారులతో నిజనిర్ధారణ కమిటికి సిఫారసు చేయాలని జెడ్పీటీసి హసీనబాను, ఎంపీపీ పవిత్ర, వైకాపా నాయకులు సింగాడి జగదీష్, రహంతుల్ల, బోజరాజు నాయక్, హొన్నూరుస్వామి తదితరులు రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో వారు ఎమ్మెల్యే కపు ను కలుసుకుని జిల్లాలో నియమ నిబంధనలను ఉల్లంగించి కన్నడ మాధ్యంలో ఉపాధ్యాయులుగా నియామకాలు పొందినవారిపై సంబంధిత అధికారులతో న్యాయవిచారణ కమిటి వేయించి నిబంధనలను ఉల్లగించిన వారిపై కఠిచర్యలు తసుకుని నిరుద్యోగులకు న్యాయం చేయాలని వారు పేర్కొన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే కాపు ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి విచారణ చేయించేలా చర్యలు చేపడుతానని హామీనిచ్చారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

డి.హిరేహాళ్ ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



మృతుడి కుటుంబానికి వైఎస్ఆర్ బీమా అందిస్తున్న దృశ్యం

డి.హిరేహాళ్ మండలం గొడిసెలపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతూ మంగలి భాస్కర్ శనివారం మృతిచెందారు. ఈ సమాచారం తెలుసుకున్న వైకాపా జిల్లా స్టీరింగ్ కమిటి సభ్యులు రవీంద్రనాథ్‌రెడ్డి, సర్పంచు సలహాదారులు, వైకాపా నాయకులు రాళ్ళ తిమ్మారెడ్డి సచివాలయ సబ్బందితో సంప్రదించి తక్షణ ఆర్థిక సహాయంకింద వైఎస్ఆర్ బీమా పథకంలో రూ.10వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. కుటుంబాన్ని పోషిస్తున్న పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబంకు వైఎస్ఆర్ బీమా ఆసరాతో పాటు తోడుగా నిలుస్తోందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ బండి రామకృష్ణారెడ్డి, విద్యా సంక్షేమ సహాయకులు గౌస్, విద్యాకమిటి ఛైర్మెన్ బోయ వన్నూరుస్వామి, వలంటీర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అడవులకు నిప్పు పెట్టడం పర్యావరణంకు హానికరం



పర్యావరణ అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

బుక్కపట్నంరూరల్, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త

అడవులకు నిప్పు పెట్టడం పర్యావరణానికి హానికరమని పర్యావరణ వేత్త భాస్కర్ నాయుడు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ మేరకు మండల పరిధిలోని సిద్ధరాంపురం, చంద్రాయుని పల్లి గ్రామాల్లో అడవులకు నిప్పు పెట్టకుండా అవగాహన కల్పించారు. ముఖ్యంగా శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా మూడులక్షల 11 వేల ఎకరాల్లో అడవులు విస్తరించి ఉన్నాయని, అవి ఈ రెండు నెలల కాలంలో నిప్పు పెట్టడం మూలంగా అగ్నికి ఆహుతవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రాణవాయువు, ఆహారం, నీరుపై ప్రభావం పడి భూమి శక్తిని కోల్పోవడం మూలంగా ఎన్నో అనర్థాలు జరుగుతాయన్నారు. బుక్కపట్నం అటవీ ప్రాంతంలో 15 వేల ఎకరాల అడవులు అగ్నికి ఆహుతి కాకుండా కాపాడడమే ధ్యేయంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ భారీ నష్టాన్ని నివారించాలని రెవెన్యూ, అటవీశాఖ, విఆర్ఓ, విఏఓలతో పాటు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డికి కూడా విన్నవించడం జరిగిందన్నారు.

## వైభవంగా అప్పిలేపల్లి శ్రీ ఆంజనేయస్వామి బ్రహ్మరథోత్సవం

కుందుర్పి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త



ఆంజనేయస్వామి రథోత్సవం

మండల కేంద్రంలోని అప్పిలేపల్లి గ్రామంలో వెలసి భక్తుల కొంగబంగారంగా కోరిన కోర్కెలను తీర్చే దైవంగా వెలిసిన బొబ్బులకుంట శ్రీ ఆంజనేయస్వామి వారి రథోత్సవం ఆదివారం జరిగింది. రథోత్సవం రోజున గ్రామం తరుపున చేయించిన 18 కొలోల వెండి కవచాన్ని స్వామి వారికి అలంకరించి నిత్యపూజలు మరియు అభిషేకాన్ని నిర్వహించి తదనంతరం భక్తుల కోసం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం శ్రీ ఆంజనేయస్వామికి చెల్లెలుగా బావించే బొచ్చుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ కుందుర్పమ్మ వారిని అప్పిలేపల్లి గ్రామప్రజలు రాత్రి 7 గంటలకు మేళతాలాలతో తప్పెట్లతో అమ్మవారిని ఆహ్వానించి ఊరేగింపుగా ఆంజనేయస్వామి దేవస్థానం వరకూ తీసుకువెళ్లారు. వేదపండింతుల సమక్షంలో పంచాగ్రశ్రవణం, పున్నోజనం చేసి రథోత్సవాన్ని శుద్ధి చేసి స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఆశీనులు గావించారు. పూలహారాలతో అందంగా ఆలంకరించిన బ్రహ్మరథాన్ని రాత్రి 11.45 నిమిషాలకు లాగడం జరిగింది. రథోత్సవం ముందు ఉదయం నుంచి ఉపవాస దీక్షలో ఉన్న వీరశైవలింగాయిత మహిళలు జ్యోతులు పట్టుకుని దేవాళం వరకూ వెళ్లి వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ రథోత్సవంలో వందలాది మంది భక్తులు మనరాష్ట్రం ప్రాంతం నుండే కాకుండా పక్క రాష్ట్రం కర్నాటక నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## సజావుగా జాతీయ ఉపకార వేతన పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ డిఇఓ మీనాక్షి

కొత్తచెరువు, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త

శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా జాతీయ ఉపకార వేతన పరీక్ష ఆదివారం సజావుగా సాగిందని శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖ కార్యాలయవర్గాలు తెలియజేశాయి. పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లలో 12 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి యు.మీనాక్షి ధర్మవరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎన్ఎంఎంఎస్ పరీక్షా కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 2,775 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, వారిలో 2,677 మంది విద్యార్థులు 96% హాజరయ్యారని, మిగిలిన 98 మంది విద్యార్థులు గైర్హాజరు కావడం జరిగిందన్నారు.

## రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లకంపలు

-ఇబ్బందులు పడుతున్న జి.మల్లాపురం ప్రజలు - పట్టించుకోని పాలకులు



రహదారి పక్కన కంపచెట్లు పెరిగిన దృశ్యం

విడపనకల్లు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

మండలంలోని పాల్తూరు నుండి గాజుల మల్లాపురం వెళ్లే రహదారికి ఇరువైపులా కంపచెట్లు పెరిగి రహదారి మూసుకపోయి వాహనదారులు ఇబ్బందులు పడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా దట్టమైన కంపచెట్లు పెరగడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు పక్కన కంపచెట్లు బాగా పెరిగి మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు సంభవిస్తాయని వాహనదారులు, ప్రయాణీకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ రహదారిలో మలుపులు ఎక్కువగా వుండడం వల్ల కంపచెట్ల పొదలతో ఎదురుగా వస్తున్న వాహనం కనిపించని పరిస్థితి నెలకొనడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంపచెట్లు విపరీతంగా రోడ్డుకు ఇరువైపులా పెరగడంతో వాహనదారుల అవస్తలు వర్ణణాతీతం. ఈ కంప చెట్లను ఎవరు తొలగిస్తారో అర్థంకాని పరిస్థితిలో ప్రజలు వున్నారు. సర్పంచు బాధ్యతతో రోడ్డుపైకి వస్తున్న కంపచెట్లను తొలగించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా వున్న కంపచెట్లను తొలగించాలని వాహనదారులు, ప్రయాణీకులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

## రంగరంగ వైభవంగా శ్రీ మల్లేశ్వరస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో కళశాలతో ముందు నడుస్తున్న యువతులు, చిన్నారులు

ఉరవకొండ, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

శ్రీ మల్లేశ్వరస్వామి గ్రామోత్సవం స్వస్తిశ్రీ శుభకృత్‌నామ సంవత్సరం మాఘశుద్ధ పౌర్ణమి ఆదివారం రాత్రి ఉరవకొండ పట్టణంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ, శివమాలదారుల సమక్షంలో సాయంత్రం శ్రీ మల్లేశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో శోభాయమానంగా తీర్చిదిద్దిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్ల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి మేళతాళాలు, డప్పువాయిద్యాల మధ్య బాణాసంచా పేల్చుతూ గ్రామోత్సవం నిర్వహించారు. దారిపొడవునా శివమాలదారుల నృత్యాలు, భజనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## ఘనంగా మైలార లింగేశ్వరస్వామి దోనిపూజ

అగళి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన అగళిలో రజకవీధి, ఎస్సి కాలనీలో మైలార లింగేశ్వరస్వామి దోనిపూజ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మైలార లింగేశ్వరుడు అనగా శివుడే. ఆదివారం రోజు ఈ స్వామికి పూజలు నిర్వహించడం ఆనవాయితీ, ఈ నెలలో స్వామివారికి కర్నాటక రాష్ట్రం మైలారలో జాతర నిర్వహిస్తారు. జాతరకు ముందు ఈ దోని పూజ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ. మైలార లింగేశ్వరస్వామి మూలవిరాట్టును వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వాములను పిలిపించి పూజలు నిర్వహించారు. గురవయ్యస్వాములు ప్రత్యేకంగా ఢమరుకం పట్టుకుని నాట్యం చేస్తూ స్వామివారిపై పాటలు పాడారు. దేవాలయం ప్రాంగణాన్ని మామిడితోరణలతో అలంకరించారు. ఎస్‌సి కాలనీలో వెలసిన మైలార లింగేశ్వరస్వామి మూలవిరాట్టును వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మరీ ముఖ్యంగా మైలార లింగేశ్వరస్వామికి ఆడ, మగ, పిల్లలకు కూడా పసుపు నుదుల రాయడం ఆనవాయితీ, ఈ పూజా కార్యక్రమాలకు హాజరైన భక్తులకు గురవయ్యలు, పూజారులు పసుపు వ్రాశారు. పూజా కార్యక్రమం మహామంగళహారతి అనంతరం ఆలయ మండలి వారు భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

## మారెన్న అమ్మ ఆత్మకు శాంతి చేకూరాలి

- రాయదుర్గం వాల్మీకి సేవా సమితి అధ్యక్షులు బండి కిష్టప్ప

కనేకల్లు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



నివాళుర్పిస్తున్న బండి కిష్టప్ప

రాయదుర్గం నియోకవర్గం కణేకల్లు రూరల్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న మాతృమూర్తి కె భీమక్క వైకుంఠం సమారాధన కార్యక్రమంలో రాయదుర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షుడు నాయకులు బంది కిష్టప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆ భగవంతుడు భీమక్క అమ్మ ఆత్మకు శాంతి చేకూర్చి ఆమె ఆత్మకు స్వర్గంలో స్థానం కల్పించాలని ప్రార్థిస్తూ అందరం ఆ దేవుడికి కోరుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూల మాలలవేసి ఘనంగా నివాళలర్పించారు. అమ్మ ప్రేమ అనురాగం, ఆప్యాయత ఆదరాభిమానులకు ఈ జగత్తులో మరేది సాటి కాదని అమ్మ ఇచ్చిన జగన్మ బంధంతో అందరం రుణ పడి ఉన్నామని ఆమె రుణం మనం ఎన్నింటికి తీర్చుకోలేనిదని ఇది అందరం గుర్తుంచుకుని తల్లిదండ్రులకు ముఖ్య ప్రధాన్యత నిచ్చి కొంతైనా వారి రుణం తీర్చుకోవాలని ఆయన సూచించారు. ఈనెల 26న భీమక్క మృతి చెందిందని ఆమె కుమారులు మారెన్న చిన్న తిమ్మప్ప, నాగరాజు, రామన్న, కుఉంబ సభ్యులకు వారి మాతృమూర్తి లేని లోటు తట్టుకునే శక్తిని భగవంతుడు ఇవ్వాలని కోరారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన వెంట ఆ సేవా సమితి మీడియా సలహాదారులు తలారి మల్లయ్య, మిత్రులు కురుబ గురుమాల్, శ్రీనివాసులు, భృమప్ప కంసాలి విజ్జి ఉన్నారు.

## స్ఫూర్తిదాయకం ఆ డ్రైవర్ల సేవలు..!



ఉత్తమ డ్రైవర్ల అవార్డులు అందుకున్న ఎ.వెంకటేశులు, పి.బాషా, బి.ఎల్.నారాయణ

ఉరవకొండ, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

ఉరవకొండ ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్లు ఎ.వెంకటేశులు, పి.బాషా, బి.ఎల్.నారాయణ సేవలు ఇతర డ్రైవర్లకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. గత 25 నుంచి 30 సంవత్సరాల తమ ఉద్యోగ ప్రస్థానంలో ప్రమాద రహితంగా బస్సులు నడిపి ప్రయాణీకులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చి వారు అందరి మన్ననలు, అవార్డు అందుకొంటున్నారు. జిల్లా కేంద్రం అనంతపురంలో ఈనెల 2వ తేదీన గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు భద్రతా వారోత్సవాల్లో వారికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్టీసీ జోనల్ ఛైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని, డీఎస్పీ మహబూబ్‌బాషా తదితరులు ఉరవకొండ డిపో మేనేజర్ బాలాజీదయాల్, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాసులు సమక్షంలో ఉత్తమ డ్రైవర్ల ప్రశంసా పత్రాలు అందించి సత్కరించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సులభతరం, సురక్షితమని వీరు నిరూపిస్తున్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో మనసును ప్రశాంతంగా ఉంచుకోవడంవల్ల, రోడ్డు నిబంధనలు పాటించడంవల్ల ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోవని అవార్డు గ్రహితలు చెబుతున్నారు. అవార్డులు దక్కడం ఆనందంగా ఉండటంతోపాటు బాధ్యతను మరింత పెంచుతున్నాయని వారు చెబుతున్నారు.

## నష్టపోయిన మిరప రైతులను ఆదుకోండి

-మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిను కోరిన వైసీపీ నాయకులు



మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డికు విన్నవిస్తున్న పెన్నహోబిళం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మెన్ యం.అశోక్‌కుమార్ తదితరులు

ఉరవకొండ, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

గత ఏడాది బోర్లు, బావుల కింద మిరప పంట సాగుచేసి ప్రకృతి వైపరిత్యాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు బీమా మంజూరుచేసి ఆదుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిను కలిసి విన్నవించినట్లు పెన్నహోబిళం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మెన్ యం.అశోక్‌కుమార్, ఆమిద్యాల పీఏసీఎస్ ఛైర్మెన్ బి.తేజోనాథ్ తెలిపారు. మంత్రి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి నివాసగృహంలో మాజీ ఎమ్మెల్యే సమక్షంలో మంత్రికు ఈ మేరకు వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. రైతులు బోర్లు, బావుల కింద పంటలు సాగుచేయగా వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది కొందరు చేసిన పొరపాట్ల కారణంగా పంటను వర్షాధారం కింద సాగుచేసినట్లు నమోదు చేయడం ద్వారా మండలంలో దాదాపు 200 ఎకరాల్లో మిరప పంటకు జరిగిన నష్టానికి బీమా రాకుండా పోయిందన్నారు. ఈ విషయమై మరొకమారు విచారణ జరిపించి బీమా అందించి రైతులను ఆదుకోవాలని కోరామన్నారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించారని కమీషనర్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో రాకెట్ల ఎంపీఈఓ కె.రామమూర్తి పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

-అధైర్యపడవద్దు అండగా ఉంటానని భరోసా

ఉరవకొండ, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

నియోజకవర్గ పరిధిలోని వజ్రకరూరు మండలం చాబాల గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త శ్రీనివాసులు కుటుంబాన్ని ఎమ్మెల్యే, పీఏసీ ఛైర్మెన్ పయ్యావుల కేశవ్ పరామర్శించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న శ్రీనివాసులును అనంతపురం ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. విషయం తెలియగానే ఆదివారం గ్రామానికి చేరుకొని మృతుని ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మృతుని భార్య లలితమ్మ, కొడుకు మాధవ్ ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్యపడవద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రేగటి నాగరాజు, సీనియర్ నాయకులు ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఉరవకొండలో ఇల్లు మారిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సతీమణి వై.భువనేశ్వరి

ఉరవకొండ, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఉరవకొండలో ఇల్లు మారారు. పట్టణంలోని 10వ వార్డు స్థానిక శ్రీ మార్కొండేయస్వామి ఆలయం పక్కనగల ఇంట్లో చేరగా ఆదివారం ఉదయం నిరాడంబరంగా జరిగిన గృహ ప్రవేశ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సతీమణి వై.భువనేశ్వరి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు స్థానిక శ్రీ మార్కొండేయస్వామి ఆలయంలో అర్చనలు జరిపారు. ఇదివరకు మాజీ ఎమ్మెల్యే స్థానిక శ్రీ షిరిడిసాయి నగర్‌లోగల ఇంట్లో ఉంటుండగా దాన్ని ఖాళీ చేశారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ జి.వన్నప్ప, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గీతమ్మ, వైసీపీ నాయకులు మూలగిరిపల్లి ఓబన్న, వేమన్న, కాసుల ఆంజినేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గుడిసెకు నిప్పంటుకొని వృద్ధుడి సజీవదహనం



దగ్ధమైన గుడిసె,కాలిపోయి మృతి చెందిన గువ్వల నాగన్న (ఫైల్‌ఫోటో)

ఉరవకొండ, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

పూరిగుడిసెకు నిప్పంటుకొని అందులో నిద్రిస్తున్న దాదాపు 80 సంవత్సరాల వయసుగల గువ్వల నాగన్న అనే వృద్ధుడు సజీవదహనమైన హృదయవిదారక ఘటన ఉరవకొండ రూరల్ పోలీస్ సర్కిల్ పరిధిలోని వజ్రకరూరు మండలం పందికుంట గ్రామంలో చోటు చేసుకొంది. ఆదివారం తెల్లవారుజామున జరిగినట్లు తెలుస్తున్న ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసుల ద్వారా తెలిసిన మేరకు వివరాల్లోకి వెళితే...నాగన్నకు భార్యా బిడ్డలు ఎవరూలేరని అయన అన్న కొడుకుల సాయంతో ఊరిబయట గుడిసె వేసుకొని అక్కడ ఉంటున్నాడని సమాచారం. వయసు రిత్యా సరిగ్గా నడవలేదని అతనికి బీడీ తాగే అలవాటు ఉందని రాత్రి బీడీ తాగి పడేసి ఉంటాడని దీంతో నిప్పంటుకొని గుడిసె తగలబడిపోయి ఉంటుందని చెబుతున్నారు. గుడిసె ఊరిబయట ఉండటంతో అది కాలిపోయిన విషయం ఎవరికీ తెలియకుండా పోయినట్లు సమాచారం. ఉదయం గుడిసె కాలి అందులో తీవ్ర గాయాలతో మరణించిన నాగన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. కాగా ఈ విషయమై పోలీసులకు ఎలాంటి పిర్యాదు అందలేదని స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఏఎస్ఐ వేణు తెలిపారు.

04ATP05_04ATP05.qxd 05-02-2023 PM 11:44 Page 1



## గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి జరిగిన మంచిని వివరించిన ఎమ్మెల్యే అనంత - మోటరోదయ కాలనీ సమీపంలో రూ.29 లక్షలతో బ్రిడ్జి ఏర్పాటుకు శ్రీకారం ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 05 ప్రభాతవార్త:

అనంత అర్బన్ నియోజకవర్గం అనంత రూరల్ మండలం రుద్రంపేట పంచాయితీలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుం చి మంచి స్పందన రావడం జరిగిందని అనంత అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్య క్రమాన్ని అనంత రూరల్ మండలం రుద్రంపేట పంచాయితీలోని విశ్వశాం తినగర్,మోటరోఉదయ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్ర మాన్ని సర్పంచ్ సుగాలి పద్మావతి ఆదినారాయణ నాయక్,స్థానిక నాయ కులతో కలిసి ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి చేపట్టి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన సంక్షేమ పథకాలు అందుతున్నయా అన్ని ప్రజలను అడిగి తెలుసుకు న్ని ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను గురించి వివరించారు. 43 నెలల్లో 98 శాతం హామీలు అమలు చేసి సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫె స్టోకు సరికొత్త నిర్వచనం చూపించారన్ని ప్రజలకు తెలియజేశారు .వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీల కు,కులాలకు, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైకాపా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రజల్లో ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూచి ఓర్వలేని ప్రతిపక్ష టిడిపి అనవస ఆరోపణలు చేస్తోం దన్నారు. అనర్హులను పట్టుకుని పథకాలు అమలు కావడం లేదంటూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయ త్నాలుచేస్తోందన్నారు. వీరి కుట్రలు, కుతంత్రాలను ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. మొన్న కురిసిన వర్షాలకు మోటరో ఉద య కాలనీ సమీపంలోని బ్రిడ్జి దెబ్బతినడంతో కాలనీ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగ కుండా రూ. 29 లక్షలతో నూ తన బ్రిడ్జి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్ర మంలో సీనియర్ నాయకులుఆలమూరు శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీ టిసిచంద్ర కుమార్, వైఎస్‌ఎంపిపి బాలాజీ, వైఎస్‌సర్పంచ్ నరేంద్రరెడ్డి, ఎంపిటిసిలు మహబూబ్‌బీ, వైకాపానాయకులు ఎంఎస్ఎస్‌సాధిక్,మాజీ సర్పంచ్ కుళ్లాయప్ప, వెంకటరామిరెడ్డి, తిరుపతి నాయుడు, వెంకటేష్ నాయక్, విజ య్, నవీన్,కొండద,రమణారెడ్డి, రామచం ద్రారెడ్డి, ఓబుళపతి, లక్ష్మి నారాయణ, సంజీవులు, పద్మావతి, గోవింద్‌రెడ్డి, నాగరాజు, వెంకట రాము డు, అధికారులు ఎంపిడిఓ బాబాఫకృద్దీన్ శ్రీవాసులురెడ్డి, అంజినేయులు పంచాయితీ కార్యదర్శి నరసింహరెడ్డి, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బ ంది,వార్డుసభ్యులు, వలంటర్లీ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాలు గురించి ప్రజలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

## గంగమ్మ తల్లి సల్లంగా చూడమ్మ...!

### -వైభవంగా శ్రీ ఏటి గంగమ్మతల్లి తిరునాళ్ళు - పెన్నానదీ పరివాహక ప్రాంతంలో భక్తుల సందడి -పుణ్యస్నానాలు ఆచరించి పూజలు జరిపిన వేలాది భక్తులు - అక్కడే కోళ్లు, పొట్టేళ్లుకోసి వండుకొని వనభోజనాలు


శ్రీ గంగమ్మ తల్లి మూలవిరాట్‌కు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


పుణ్యస్నానాలు ఆచరిస్తూ భక్తుల దృశ్యాలు


అశ్వర్థనారాయణస్వామి కట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు


వాహన రాకపోకలను పర్య వేక్షి స్తున్న సీఐ వి.హరినాథ్ సిబ్బంది

ఉరవకొండ, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

ఉరవకొండ మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెన్నహోబిళం శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయానికి సమీపంలోగల అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిలోని భారీ వంతెన క్రింద ప్రవహించే పెన్నానది పరివాహక ప్రాంతంలో స్వస్తిశ్రీ శుభకృత్‌నామ సంవత్సరం మాఘమాస 3వ ఆదివారం శ్రీ ఏటి గంగమ్మ తల్లి తిరునాళ్ళు వైభవంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు సునీత, చెన్నయ్యనాయుడు దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు నిర్వహించగా పెన్నహోబిళం ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్, వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని శ్రీ అశ్వర్థనారాయణ కట్టవద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంతకుమునుపు పెన్నానదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు గంగమ్మతల్లికి మొక్కులు తీర్చుకున్నారు. అన్ని నదుల్లోకెల్లా పెన్నానది ఎంతో పవిత్రమైనదని, మాఘమాసంలో ఈనదిలో పుష్కరుడు వుంటాడన్న నమ్మకంతో ఇక్కడ స్నానాలు చేసి మొక్కులు తీర్చు కోవడం అనాదిగా వస్తోంది. కాగా వివిధ ప్రాంతాల నుండి తిరునాళ్ళకు వేలాదిగా తరలివచ్చిన భక్తులు నది ఒడ్డున గొర్రెలు మేకలు, పొట్టేలు, కోళ్లను కోసి పాత ఐరన్ బ్రిడ్జీ, నూతన సిమె ంట్ బ్రిడ్జీ క్రింద వండు కొని వన భోజనాలు సాగించారు. కోర్కెలు తీరిన వా రు అమ్మ వారికి తలనీలాలు సైతం సమర్పించారు. ఈ ప్రాంతంలో ఆట వస్తువులు, మిఠాయిల దుఖానాలు, చెరుకుగడల విక్రయాల దుకాణాలు వెలి యగా కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. గంగమ్మతల్లి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు పెన్నహో బిళానికి చేరుకొని శ్రీ లక్ష్మినరసింహస్వామి, శ్రీ ఉద్భవలక్ష్మి అమ్మవారి ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. తిరునాళ్ళ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో అనంతపురం -బళ్లారి జాతీయ రహదారి వాహన రాకపోకలకు రద్దీ కనిపించి ంది. కాగా గత ఏడాదితో పోల్చితే ఈ యేడాది వివిద ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తుల సంఖ్య కాస్త తగ్గిందని చెప్పాలి. కాగా వైసీపీ యువనేత వై.భీమరెడ్డి ఆధ్వర్యంలో తిరునాళ్లలో భక్తులకు ఉదయం ఫలహారం, మధ్యా న్నం అన్నదానం నిర్వహించారు. తిరునాళ్ళలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఉరవకొండ యుపీఎస్ సీఐ యు.హరినాథ్ నేతృత్వంలో సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు.

## కన్నుల పండువగా అశ్వర్థనారాయణ స్వామి తిరుణాల

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 05 ప్రభాతవార్త:

అనంత రూరల్ మండల పరిధిలోని సోములదొడ్డి గ్రామ సమీపంలో వెలసిన అశ్వర్థనారాయణస్వామి తిరుణాల కన్నుల పండువగా సాగింది. ఆదివారం సోమలదొడ్డి సర్పంచ్ వై.లింగేశ్వరి,వైకాపారైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిటిసి లక్ష్మి, వైకాపా నాయకుడు విశ్వ నాథ్‌గ్రామపెద్దలు, దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ తిరుణాల పురస్కరానికి రాప్తాడు ఎమ్మె ల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎంపిగోరంట్ల మాధవ్,జెడ్పిచైర్మన్ గిరిజ మ్మ,ఎంపిపి గుజ్జల వరలక్ష్మి ముఖ్య అతిధులుగా హజకావడంతో వారికి సర్పంచ్,ఎ ంపిటిసి వైకాపా నాయకుడు వై.చంద్రశేఖర్‌రెడ్డి,గ్రామ ెద్దలు, ఆలయ ధర్మకర్త, కమిటీ సభ్యులు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలకడంతో వారు అశ్వర్థ నారాయణస్వామిని దర్శించు కున్నిస్వామి అశీస్సు లు పొంది తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లా డుతూఅనంత రూరల్‌లో గల పురాతన దేవాలయాల్లో అశ్వర్థ నారాయ ణస్వామి దేవాలయంలో శివుడు కొలువై ఉన్నారని ఈ దేవాలయంలో ప్రతి సంవత్సరం మాఘ మాసం నెలలోస్వామి వారిని ఊరేగించి తిరుణాలను సోములదొడ్డి గ్రామపెద్దల సమక్షంలో గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిం చడం జరుగుతుం దన్నారు. అందులో భాగంగా రెండో సంవత్సరం గ్రామ సర్పంచ్ వై.లింగేశ్వరి, ఎంపిటిసికె.లక్ష్మి, వైకాపా నాయకుడు వై.చంద్రశేఖం రెడ్డి ,గ్రామ పెద్దలు, ఆధ్వర్యంల ో అశ్వర్థనారాయణస్వామి తిరుణాలను నిర్వహించడం చాలా సంతోష మన్నారు. అశ్వర్థనారాయణస్వామి సమాజంలో సూర్య చంద్రులు ఎలాగో భగవంతుడు ఒక్కరేనని ఆ భగవం తుడుశివుడేనని చాలా మంది హిందు వులు నమ్ము తారన్నారు. సమాజంలో శివుడు లేని చోటు ఉండదని ప్రతి చోట శివుడు ఉంటారన్నారు. ముక్కోటి దేవతలకు ఆదిదం పతులైన శివపా ర్వతులకు దేశవ్యాప్తంగా ఎన్నో గొప్ప ఆలయాలు ఉన్నాయని వాటిలో ఒక్క టిసోములదొడ్డి గ్రామంలోగల అశ్వర్థ నారాయణ స్వామి దేవలయం అత్య ంత మహిమా న్వితమైనదన్నారు. ఈ తిరుణాల జరపడడం వలన ఆ శివుడు గ్రామంలోని ప్రతి ఒక్కరిని చల్లగా చూడడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్ర మంలో వైకాపా నాయకులు,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


స్వామిని దర్శించు కుంటున్నరాప్తాడు ఎమ్మెల్యే, ఎంపి,జెడ్పి చైర్మన్,ఎంపిపి


ఎమ్మెల్యే, ఎంపి,జెడ్పి చైర్మన్‌లకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

## అందరికి సంక్షేమ ఫలాలు దరిచేర్చాలి

డి.హిరేహాళ్ ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

అర్హులందరికి వలంటీర్లు సమర్థ వంతంగా సంక్షేమ పథకాలు దరిచేరుస్తు న్నారని ఇక నుండి కన్వీనర్లు గ్రామ సారథులతో కలసి సంక్షేమ ఫలాలు మరింత సమర్థ వంతంగా అందించి ప్రభుత్వం ఇచ్చే పథకాలు వారికి వివరిం చాలనొ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం డి.హిరేహాళ్ మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం, మండల పరిది లోని కాదాలూరు గ్రామ సచివాలయ ఆవరణలో వైకాపా అధ్యక్షు డు పైలా నరసింహయ్యతో కలసి కనీనర్లు, గ్రామ సారథులు, వలం టీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా కాపు మాట్లాడుతూ కన్వీ నర్లు, సారథులు, వలంటీర్లు ప్రతి 50 కుటుంబాలకు ఒక క్లస్టర్‌గా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను అందించి వివరించా ల్సిన బాధ్యత మతదేనని సూచించారు. పైలా నరసింహయ్య మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే అన్న నినాదంతో ముందుకెళ్దామని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఉన్న వైకాపా గర్తును ముఖ్యమంత్రి పేరును ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళి గుర్తుండేలా చేయాలని తెలిపారు. మార్టీ మీకు అన్ని విదాల అండంగా ఉంటు సహాయ సహకారాలు అందిస్తుందని తాము మీకు తోడుగా ఉంటామని అంతే కాకుండ మీకు జీవిత బీమా, ప్రమాద బీమా ఇస్తూ పార్టీలో సముచిత స్థానంతోపాటు పార్టీ కార్యక్రమాల్లో మీకు ప్రత్యే ఆహ్వానితులుగా గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ ఎం.పవిత్ర, జెడ్పీటీసీ హసీనీ బాను, సర్పంచులు లక్ష్మి, లీలావతి, శ్రీనివాసు లురుడ్డి, మల్లికార్జున, రుద్రేష్, పుష్పావతి, పార్వతి, పరమేశ్వ రప్ప, హను మంతరెడ్డి, ఉపసర్ప ంచు కరిడి మల్లికార్జున, ఎంపీటీసీలు అనిత, భారతి, జిల్లా ప్రతినిధి మాధవ రెడ్డి, రాయ దుర్గం మర్కెట్‌యార్డ్ ఛైర్మెన్ బోజరాజునాయక్, వైకాపా మండ ల కన్వీనర్ హొన్నూ రుస్వామి, విద్యాకమిటి చైర్మెన్ తొండ వెంకటేశవులు, యాదవ సంఘం అధ్యక్షులు సురేష్‌యాదవ్, వైకాపా మండల మైనార్టీ నాయకుడు రహంతుల్ల, వైకాపా నాయకులు సింగాడి జగదీష్, వీరశేఖరప్ప, శివరా మరెడ్డి, రాళ్ళ తిమ్మారెడ్డి, ఎస్.హెచ్.ఆర్, పెద్ద అంజనేయులు, సురే ష్, నాగరాజు, శిలింగ, ఎరిస్వామి, గోవిందు, నల్లబండ్ల వవన్నూరుప్ప, సింగాడి మంజునాథ్, ఖాశీంపీర, గన్ని గౌడు, శంకరప్ప, నరసింహప్ప, గం గిరెడ్డి, రామకృష్ణ, శివారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మహేష్, బాబు, ఓంకార్, హను మంతు, ప్రకాష్‌రెడ్డి, మల్లికార్జున,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాపు


మాట్లాడుతున్న వైకాపా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

## వైభవంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం

రాయదుర్గం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

రాయదుర్గం నియోకవర్గంలోని రాయదుర్గం మండలం మల్లాపురం గ్రామంలో వెలసిన శ్రీ విప్లమలై లక్ష్మీనరసింహ బ్రహ్మ రథోత్సవము ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా బ్రహోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటి గౌరవాధ్యక్షులు శ్రీరామ్మూర్తి స్వామీజి ఆలయ అర్చకులు సుబ్రమణ్యం వేద పండితులు హరి ప్రసాద్ భరద్వాజ్ ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ సమేత స్వామి వారికి సుప్రభాత సేవ పంచామృతాభిషేకం, శ్రీవారి నిత్య కైంకర్యములు రథంగా హోమం నిర్వహించారు. అనంతరం మడుగుతేరు అశేష భక్త జన మధ్య మేళ తాళాలతో భాజా భజయంత్రీలు వాయిస్తూ గోవింద నామస్మరణతో బ్ర హ్మరథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ము ఖ్య అతిథులుగా రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, ఏపిఐఐసి చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, మునిసిపల్ ఛైర్ పర్సన్ పోఓరాళ్ళ శిల్ప, ఆనం దపు శెట్టి అండ్ సన్స్ శ్రీనివాసులు నియో ఖవర్గం ముఖ్య నాయక ఉలు హాజరైఊ స్వామి వారి సేవలో పాల్గొన్నారు. బ్ర హోత్సవాల్లో భాగంగా కళ్యాణదుర్గం డిఎస్పీ శ్రీనివాసులు రాయదుర్గం రూరల్ సర్కిల్ ఇన్సి స్పె క్టర్ యుగంధర్ ఎస్ఐ సుమన్ ఆధ్వర్యంలో జాతరలో ఏలాంటి అవాం ఛనీ య సంఘనలు జరుగకుండా భారీ బందో బస్తు నిర్వహించారు. ఈ కార్య క్రమాన్ని ఆలయ కమిటి అధ్య క్షులు బిఎన్ తిప్పేస్వామి ఉపాధ్య క్షులు ధర్మ న్న కోశాధికారులు జిఎన్ నరసింహులు, సత్య నారాయణ కార్యదర్శి గురు రాఘవేంద్ర ప్రసాద్, అకౌంటెంట్ వెంకటేసులు, కమిటి సభ్యులు గుర్నా థ్‌రెడ్డి, రామిరెడ్డి, కమలాసుదు నరసింహులు, వెంకటరెడ్డి, బాలయ్య తది తరులు పాల్గొన్నారు.


భక్తులతో కిటకిటలాడి రథోత్సవం


ప్రత్యేక లంకరణలో శ్రీ క్ష్మీనరసింహస్వామి


హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

## జిల్లాలో కోటి మొక్కలు నాటడమే గ్రీన్ భారత్ ధ్యేయం - ఛైర్మన్ శంకర్ నారాయణ

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త

శ్రీసత్యసాయి జిల్లాలో కోటి మొక్కలు నాటడమే ధ్యేయంగా పని చేస్తున్నామని గ్రీన్ భారత్ ఫౌండేషన్ ఛైర్మన్ రెడ్డివారి శంకర్ నారాయణ తెలిపారు. ఆదివారం సత్యసాయి ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ జిబి(గ్రీన్‌భారత్) ఛానల్‌ను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా శంకర్‌నారాయణ మాట్లాడుతూ, విద్యార్థులు ఉపాధ్యాయులు, మేధావులు అన్ని వర్గాల ప్రజల ను కలుపుకొని పచ్చదనం పెంచడమే ముఖ్యఉద్దేశ్యంతో పని చేస్తామన్నారు. ప్రజలను పచ్చదనం పెంచడం, ప్రాణవాయువు కాపాడు కొనుటకు పర్యావ రణ పరిరక్షణకు, ప్లాస్టిక్ నిషేధానికి ఈ ఛానల్ ద్వారా చైతన్యం తెస్తామన న్నారు. పల్లె పల్లెలోను గ్రామ కమిటీలు ఏర్పాటు, విద్యార్థులతో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేసి మొక్కలు పెచడం, పరిరక్షించడంపై చైతన్యం తెస్తామన్నారు. 32 సంవత్స రాలుగా ఉపాధ్యాయుడిగా ఉంటూ వేలాది మొక్కలు నాటడం వల్ల నేడు మహావృక్షాలు అయి నాయన్నారు. కేవలం పచ్చ దనం పెంచడంపైన ప్లాస్టిక్ నిషేధం పైనే ఈ ఛానల్ పని చేస్తుందన్నారు. రత్నాకర్ మా ట్లాడుతూ, ఈ మంచి ఆశ యానికి తమవంతు సహకా రం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా ఇన్ చార్జ్ నిజాముద్దీన్, ఆదినా రాయణ, శ్రీరా ములు తది తరులు పాల్గొన్నారు.



జిబి ఛానల్‌ను ప్రారంభిస్తున్న ఆర్.జె.రత్నాకర్

## కన్నులపండువగా బొలికొండ శ్రీరంగనాథస్వామి రథోత్సవం - హాజరైన ఎమ్మెల్యే వైవిఆర్

గుత్తి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

మండలంలోని తొండపాడు గ్రామంలో ఆదివారం శ్రీబొలి కొం డ రంగనాథస్వామి రథోత్సవం అంగరంగవైభవంగా జరిగి ంది. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, వైకాపా ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, జెడ్‌పిటిసి రాధికా యాదవ్, షఫిలు తదితరులు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఇఒ దేవదాస్‌తో పాటు ఆలయ చైర్మన్ రామాంజిరాయల్, పండి తులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు స్వా మివారికి ప్రత్యేక పూజలు గావించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున కళ్యాణకట్ట వద్ద స్వామివారి కళ్యా ణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా రథానికి ఎమ్మెల్యే పూజ లు నిర్వహి ంచారు. భక్తులు గోవింద నామస్మరణతో రథాన్ని లాగుతూ ముందుకు సా గారు. భక్తులు తమ కోర్కెలు నెరవేరాలంటూ రథ చక్రాల కింద గుమ్మ డికా యలు వేస్తూ తమ మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుమునుపు రంగనా థస్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలను రథంపై వుంచి పూల మాల లతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రంగ నాథస్వామి రథోత్సవంలో భారీగా పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిక్కిరిసింది. తిరుణాల సందర్భంగా ఏర్పాటు చేసిన రంగుల రాట్నా లు, జెయింట్‌వీల్ ప్రజలను ఆకట్టుకున్నాయి. తిరుణాలలోని దుకాణాలు వచ్చిన వారితో కిక్కిరిసిపోయాయి. తెల్లవారు జామున శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. తిరుణాలకు పందేరపు బండ్లతో భక్తులు పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం గుత్తి, గుంత కల్లు డిపోల నుండి ప్రత్యేకం గా బస్సులను నడిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రథోత్సవంలో మాణి క్యరంగనాథస్వామి ఆలయ కమిటీచై ర్మన్ మాకం శ్రీకాంత్, మాజీ జెడ్‌పిటిసి ప్రవీణ్‌కుమార్‌యాదవ్, సింగి ల్‌విండో చైర్మన్‌పురు షోత్తయ ాదవ్, జిల్ల నాయకులు మధుసూదన్‌రెడ్డి, సివి రంగారెడ్డి, కౌన్సిలర్లు వరదరాజులు, రమణ, వాల్మీకిశివ, గుత్తి కోట సం రక్షణ సమితి చైర్మన్ విజయభాస్కర్, రమేష్‌రెడ్డితో పాటు పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, వైకాపా నేతలు, తదితరులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా గుంతకల్లు డిఎస్‌పి నరసింగప్ప ఆధ్వర్యంలో గుత్తి సిఐ వెంకటరా మిరెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు భారీ బందోబస్తు నిర్వహించారు.


శ్రీరంగనాథస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


ఎమ్మెల్యే వైవిఆర్ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## నిస్సహాయ రైతు కుటుంబాలకు అండగా ఉంటాం - సంయుక్త కలెక్టర్

అనంతపురం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త బ్యూరో

జీవనరేఖ కార్యక్రమంలో భాగంగా ఆర్థిక ఇబ్బందుల వల్ల నిస్సహాయ స్థితిలో వున్న ఇద్దరు రైతు కుటుంబాలను సంయుక్త కలెక్టర్ కేతన్‌గార్గ్ స్వయ ంగా ఆదివారం తన కార్యాలయానికి పిలిపించి వారికి వున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా చియ్యేడు గ్రామా నికి చెందిన పెద్దకాటప్ప గారి చందు తమకు ఇద్దరు సంతానం వున్నారని అలాగే తాను పక్షవాతం సమస్యతో బాధపడుతున్నానని తమ ఆర్థిక ఇబ్బం దుల వల్ల తన కుమారుడు ఉన్నత చదువులను మధ్యలోనే ఆపివేయడం జరిగిందని, అలాగే బ్యాంకు వారు పంట రుణాలను సకాలంలో చెల్లించి నప్పటికి రుణాలను తిరిగి మంజూరు చేయడంలేదని వారికి గల భూమికి డ్రిప్ సౌకర్యం కల్పిం చవలెనని, మరియు జీవనోపాధి కొరకు డైరీ మంజూరు చేపించలసినదిగా కోరారు. మరొక రైతు రాప్తాడు మండలంకు చెందిన నల్లప్ప తమకు గత నాలుగు సంవత్సరాల నుండి పంట నష్టం జరిగి తాము ఆర్థికంగా ఇబ్బం దులు పడుతున్నామని, తమ కు ప్రభుత్వ పథకాలైన రైతు భరోసా, అమ్మఒడి డబ్బులు మంజూరు అయినప్పటికి బ్యా ంకు వారు పంట లోను బాకీ వున్నందున తమకు అందించ డంలేదని తెలిపారు. సంయుక్త కలెక్టర్ వారు ఆర్థికంగా అభివృ ద్ధి చెందేందుకు ప్రభుత్వం తరుపున తనవ ంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇవ్వడం జరిగింది. అలాగే సంబంధిత శాఖ అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చి తమకు ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తామని ఆయన వారికి తెలియచేశారు.


ఇబ్బందులను అడిగి తెలుసుకుంటున్న సంయుక్త కలెక్టర్

## గంగాభవాని ఆలయ నిర్మాణానికి భూమిపూజ

### - పాల్గొన్న ఆర్.జె.రత్నాకర్, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త

ప్రముఖ పుణ్యక్షేత్రమైన పుట్టపర్తి పట్టణంలో చిత్రావతి నది ఒడ్డున వెలసిన గంగాభవాని ఆలయ నిర్మా ణానికి భూమి పూజలో ప్రముఖులు పాల్గొన్నారు. ఆదివా రం భూమిపూజ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్, పుట్టపర్తి శాసన సభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొని ఆల య నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. ఎన్నోయేళ్ళుగా నది ఒడ్డున గంగమ్మకు చిన్న గుడి ఉందని, పెద్ద ఆలయం నిర్మించుటకు దాతలు సహకారంతో నిర్మాణానికి పూనుకు న్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ పి.సి.గం గన్న, టిడిపి జిల్లా కార్యదర్శి సామ కోటి ఆదినారాయణ, పుట్ల వంశస్తులు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.


భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి


పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆర్.జె.రత్నాకర్

## ప్రతి ఇంటికి జగనన్న సంక్షేమ కార్యక్రమాలు వెళ్లాలి - ఎమ్మెల్యే దుద్దుకుంట

### - అభివృద్ధి సంక్షేమం ప్రజలకు మరింత చేరువకై గృహ సారధులు

నల్లమాడ ఫిబ్రవరి 05 ప్రభాతవార్త,

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తి దగ్గరకు జగనన్న ఫోటోతో వాలింటర్లు, నూతనంగా నియమింపబడిన గృహసారధులు వెళ్ళాలని స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గంగా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్లు, గ్రామ వాలింటర్లు, నూతనంగా నియమించబడిన గృహ సారధులకు మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅ తిథిగా పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వాలు గానీ,ఏ ముఖ్యమంత్రి గానీ ఇటువంటి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నేరుగా లబ్దిదారులకు అందించిన దాఖలాలు లేవని, కులాల కు, మతాలకు, పార్టీలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమ ంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి ఇంటి వద్దకు సంక్షేమ కార్యక్రమాలు తీసుకెళ్లి మరలా ముఖ్య మంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి గెలిచి విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత చేరువ చేసే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా గృహ సారధులకు నియమించినట్లు శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నూత నంగా నియ మింపబడిన గృహ సారధులు ఇంటింటికి వెళ్లి గత ప్రభుత ంలో చేసిన మోసాలను ప్రజల్లోకి వెళ్లి ఎండగడుతూ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సం క్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజ లకు వివరి ంచాల్సిన బాధ్యత గృహస ార ధులపై ఉందని తెలి పారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కుళ్ళాయ్ నాయక్, ఎంపీపీ సునితా బాయి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుల పొరకల రమణ, జెడ్పీటీసీ రామచం ద్రారెడ్డి, గ్రామ కన్వీనర్ కదిరిసాని వేణుగోపాల్, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌హెచ్ బాషా, సర్పంచులు కుళ్ళాయప్ప, లింగమూర్తి, రామోహన్‌రెడ్డి, రజనీకా ంత్‌రెడ్డి, బొజ్జే నాయక్, దుదుకుంట వెంకటరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఎస్టీ సెల్ నాయకులు అంజినాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

## శ్రీ చౌడేశ్వరీ దేవి జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే,నియోజకవర్గ పరిశీలకులు


అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే,నియోజకవర్గ పరిశీలకులు

తలుపుల, ఫిబ్రవరి 05 ,ప్రభాతవార్తః

మండలపరిదిలోని బట్రేపల్లి గ్రామంలో జరుగుతున్న శ్రీ చౌడేశ్వరీ దేవి జాతరలో ఎమ్మెల్యే పి.వి. సిద్దారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు నాగభూ షణం ముఖ్య అతిథుల ుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి చల్లని దీవెనలతో ప్రజలందరు పాడి, పంటలతో,సుఖసంతోషాలతో జీవి ంచాలని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మో హన్‌రెడ్డికి అమ్మవారి దీవెనలతో రాష్ట్రంలో మంచి కార్యక్రమాలు చేపట్టే విదంగా కరుణ,కటాక్షం ప్రసాదిం చాలని వేడుకొ న్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి మహమ్మద్ రఫినాయక్, స్థానిక సర్పంచ్ వెంకటనారాయణ, తలుపుల ఉప సర్పంచ్ డి.కె.బాబు, స్థానిక ప్రజాప్రతి నిథులు, నాయకు లు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే


వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తనకల్లు, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ నందు గల పొలం సిద్దారెడ్డి ఫంక్షన్ హాల్ నందు తనకల్లు మండలం మారప్పగారిపల్లి వ్యాస్తవ్యులు జనాబ్ చిలకల మస్తాన్‌వలి కుమారుడు సి. ముబారక్ వివాహ వేడుకలో కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి పాల్గొని వధువరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యేతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు వైకాపా నాయకులు బాబాఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.